క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

తలమడుగు: మండలంలోని లింగి గ్రామంలో సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కుచులాపూర్, సుంకిడి, కొత్తూరు, తలమడుగు, బరంపూర్, దేవాపూర్, ఉండం, అర్లి, పల్సి, ఆదిలాబాద్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం సాయిబాబా పల్లకి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశోక్, మాజీ సర్పంచ్ పోచన్న, వెంకటేశ్, అశోక్, ప్రమోద్, దశరథ్, విట్టల్, రామ్ కిషన్, వెంకన్న యాదవ్, పోచ్చన్న, పైడి నారాయణ, ప్రమోదు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీ ఎన్నిక

సిరికొండ: జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బుర్ర సతీష్ ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జి కాంబ్లే బాలాజీ సమక్షంలో మండలంలోని సిరికొండ గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఓరగంటి వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా బెజ్జంకి వెంకటేశ్, కార్యదర్శులుగా ఓరగంటి ఉపేందర్, చందు, సాయికుమార్, శేఖర్, రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంబ్లే బాలాజీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అయ్యప్ప మాలాధారులు



ఎమ్మెల్యేతో స్వాములు

బోథ్: సొనాల గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఉదయం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

నేరడిగొండ: పాడి పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేదపండితులు ఎల్కొచి శ్రావణ్ కుమార్ జోషి ఆధ్వర్యంలో నాయిడి శంకర్-మల్లేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మహాలక్ష్మి దేవికి మంగళహారతి ఇచ్చారు. డప్పువాయిద్యాలతో శోభాయాత్రగా వెళ్లి ఆలయంలో పూజలు చేశారు. ప్రతిఏడాది మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి'



మాట్లాడుతున్న భరత్ చౌహాన్

ఉట్నూర్‌రూరల్: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు భరత్ చౌహాన్ డిమాండ్ చేశారు. ఏళ్లుగా గిరిజనులతో పాటు గిరిజనేతరులు సైతం పంటలు సాగు చేసుకుటూ జీవనం కొనసాగిస్తున్నారని వారికి పట్టాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి గిరిజన హక్కులను కాపాడాలని, ఏజెన్సీ ప్రాంతంలో 1970 సంవత్సర కంటే ముందు నుంచి కాస్తులో ఉన్న గిరిజనేతర రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఆయన వెంట రైతులు శంకరయ్య, సత్తయ్య, బండి నర్సయ్య, సిద్దార్థ, సాయికుమార్, కొమురయ్య, శ్రీనివాస్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భయంభయం



చిరుతపులి దాడిచేసి చంపిన ఎద్దును పరిశీలిస్తున్న అధికారులు

- గ్రామ సమీపంలోకి వచ్చి దాడి చేస్తున్న చిరుతపులి
- 15 రోజుల్లో రెండు ఘటనలు
- బయటకు వెళ్లలేని పరిస్థితి

బజార్‌హత్నూర్: మండలంలో చిరుతపులి సంచారం గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. గత 15 రోజుల్లో బుర్కపల్లిలో ఎద్దును చంపడం, రెండు రోజుల క్రితం డేడ్రా గ్రామానికి చెందిన అర్క భీంబాయిపై దాడిచేసి గాయపరిచింది. తర్వాత నాలుగు రోజులకే మాడగూడ గ్రామ సమీపంలో రోడ్డు దాటుతూ కనిపించింది. వారం క్రితం కొలారి గ్రామ సమీపంలో పంట పొలాల్లో వ్యవసాయ కూలీలకు చిరుతపులి కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో దట్టమైన అటవీ ప్రాంతంలో 30 గిరిజన గ్రామాలున్నాయి. ఈ అటవీ ప్రాంతం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండడంతో తిప్పేశ్వర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి చిరుత పులులు వస్తున్నాయి. రైతులకు పొలం పనులకు వెళ్లలేని పరిస్థితి.

నివాసాలకు సమీపంలోకి..

మండలంలో గత 15 రోజుల్లో నాలుగుసార్లు గ్రామాల సమీపంలో చిరుతపులి సంచరించడం ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈనెల 1న మండలంలోని బరంపూర్ ఫారెస్ట్ బీట్ పరిధిలోని బుర్కపల్లి గ్రామానికి చెందిన సిడం నాందేవ్‌కు చెందిన ఎద్దును చిరుతపులి గ్రామ సమీపంలోకి వచ్చి దాడి చేసి చంపింది. మండలంలోని డేడ్రా గ్రామానికి చెందిన అర్క భీంబాయి నెల 14న వేకువజామున గ్రామ సమీపంలో బహిర్భూమికి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే మాటు వేసిన చిరుతపులి ఒక్కసారి భీంభాయి తలపై పంజా విసిరింది. భయపడి కేకలు వేయడంతో చిరుతపులి అక్కడి నుంచి పారిపోయింది. వెంటనే పీహెచ్‌సీకి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. దీంతో చిరుత దట్టమైన అడవిలో కాకుండా గ్రామాల సమీపంలోకి వచ్చి దాడి చేయడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. ఫారెస్ట్ అధికారులు మాత్రం దాడి చేసిన ప్రతిసారి మహారాష్ట్ర సరిహద్దు దాటి వెళ్లి పోయిందని మభ్యపెట్టడంతో గిరిజనులు ఎవరిని నమ్మాలో నమ్మొద్దో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిరుతను పట్టుకోవాలి



గత 15 రోజులుగా చిరుతపులి సంచారంతో కంటికి కునుకు లేకుండా గడుపుతున్నాం. పశువులను చేన్లకు తీసుకెళ్ల లేకపోతున్నారు. అటవీ జంతువుల దాడిలో మరణించిన పశువులు, మనుషులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి. చిరుతపులిని వెంటనే పట్టుకుని టైగర్ రిజర్వు ఫారెస్ట్‌కు తరలించాలి. చిరుతపులి సంచారం ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలి.

– మడవి ప్రకాష్, మాజీ సర్పంచ్ మాడగూడ

అప్రమత్తంగా ఉండాలి

అటవీ ప్రాంతం సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోగా పొలం పనులు పూర్తి చేసుకుని ఇంటికి చేరుకోవాలి. పంట పొలాల్లో విద్యుత్, సోలార్ కంచెలు పెట్టొద్దని, పశువులను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లవద్దు. చిరుతపులి దాడిలో గాయపడిన, మృతి చెందిన వారికి ప్రభుత్వం పరిహారం అందజేస్తుంది. అడవి జంతువులకు ఎలాంటి హాని చేయకూడదు.

– పుండలిక్, ఎఫ్ఆర్‌వో, ఇచ్చోడరేంజ్

ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పులి దాడులో అమాయక ఆదివాసీలు చనిపోతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. పులి దాడిలో గాయపడి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బజార్‌హత్నూర్ మండలం డెడ్రా గ్రామానికి చెందిన భీమాబాయిని ఆదివారం నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మాజీ కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్‌ను పరామర్శించారు. ఉమ్మడి జిల్లాలో పులుల సంచారం పెరిగినా.. ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం, అటవీ అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. పులుల నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆయన వెంట రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు సాజిదొద్దిన్, నారాయణ, పరమేశ్వర్, రమేశ్, జగదీష్ పాల్గొన్నారు.



భీమాబాయిని పరామర్శిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: చిరుతపులి దాడిలో గాయపడి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బజార్‌హత్నూర్ మండలం డెడ్రా గ్రామానికి చెందిన గిరిజన మహిళ అర్క భీమాబాయిని ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి ఆర్థిక సాయం అందేలా చూస్తానని సుగుణ అన్నారు.

పరామర్శ



కమిషనర్‌ను పరామర్శిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు తల్లి దేవుబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆదివారం స్థానిక ధోబి కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేవుబాయి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి వెంట నాయకులు నవీన్ రెడ్డి, ఇర్ఫాన్ ఉన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీకి చెందిన వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు జెల్పెట్ గోవింద్, కాంగ్రెస్ మండల నాయకులు జెల్పెట్ మారుతి తల్లి పద్మినిబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు ఆత్రం సుగుణ ఆదివారం భీంనగర్ కాలనీలో పర్యటించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

నేరడిగొండ: బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్ రెడ్డి సోదరుడి కుమారుడు అల్లూరి కార్తీక్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆదివారం తేజపూర్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

భగవంతుని ఆరాధనతో ఆనందం



పీఠాధిపతి ఏకనాథ్ మహరాజ్‌తో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్: భగవంతుని ఆరాధన ఆనందాన్ని ఇస్తుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని రామమందిరం వద్ద గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తహం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ వ్యక్తి తన నిత్య జీవితంలో కొంత సమయం భగవంతుని ఆరాధనకు కేటాయించాలన్నారు. అనంతరం ఆలయ పీఠాధిపతి శ్రీసంత్ ఏకనాథ్ మహరాజ్ ఆశీస్సులు పొంది కీర్తనను తిలకించారు. అన్నదాన కార్యక్రమానికి తన వంతుగా ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట స్థానిక నాయకులు పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, గజానంద్ గిత్తే, భీంరావ్ నాయక్, తెలంగే మాధవ్, సజ్జన్ సింగ్, జాదవ్ రమేశ్, షాగీర్‌ఖాన్, గాడ్గే సుభాష్, ప్రతాప్ సింగ్, మాధవ్ కేంద్రే, రాహుల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

తోషం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ఆవుల రమేశ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. గత నాయకులు ఉద్యమకారులను గుర్తుంచక పోవడంతో పార్టీకి దూరంగా ఉన్నానని అనిల్ జాదవ్ నేతృత్వంలో పార్టీలో పని చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. స్థానిక నాయకులు సదానంద్, అలీంఖాన్, సలీంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

తలమడుగు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగె బ్రహ్మానంద అన్నారు. ఆదివారం మండలంలోని సుంకిడి గ్రామంలో బీజేపీ పోలింగ్ బూత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యకర్తలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వామి, ధనుంజయ్, ముత్యాల దేవన్న, దాతాజీ కిరణ్, గోడం భుజంగ్, అశోక్, రవీందర్, శ్రీని వాస్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించాలి

గుడిహత్నూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ప్రాతినిధ్యం వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. మండలంలోని గర్కంపేట్, వైజాపూర్, మల్కాపూర్‌లో బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించి బూత్ కమిటీలను ఎన్నుకొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఇది వరకు చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి ప్రజల ద్వారా ఎన్నుకొని స్థానిక సంస్థల్లో కీలక పాత్ర పోషించాలన్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. ఆయన వెంట నాయకులు కుమార్ కేంద్ర, జాలీంషావ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పతంగె బ్రహ్మానంద్

క్రీడాకారులకు అండగా ఉంటా

- మాజీ మంత్రి జోగు రామన్న



పోటీలను ప్రారంభిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమకు ఆసక్తి కలిగిన క్రీడల్లో నైపుణ్యాలను సాధించి ఉన్నతంగా ఎదగాలని, వారికి అన్ని విధాలా అండగా ఉంటానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల గ్రామంలో జోగు ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ ఉత్సాహపరిచారు. అంతకు ముందు గ్రామంలోని దత్తాత్రేయుడి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం పెరుగుతుందన్నారు. క్రీడల ద్వారా ఆటల సామర్థ్యాన్ని మెరుగు పరుచుకుంటూ.. ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంపీపీ గండ్రత్ రమేశ్, సేవ్వా జగదీష్, కుమ్ర రాజు, పరమేశ్వర్, కనక రమణ, మోతీరం, జంగు బాపు,అశోక్, ప్రకాష్, సోము పటేల్ పాల్గొన్నారు.

పూలాజీబాబా చూపిన మార్గంలో నడవాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: సద్గురు శ్రీసంత్ పూలాజీబాబా చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని అంజీ గ్రామంలో పూలాజీబాబా ధ్యాన్‌కేంద్రంలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఆంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలతో కలిసి పూలాజీబాబా ఆలయంలో బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంద్ ఆదివాసీ సమాజ్ పెద్దల ఆధ్వర్యంలో సత్కరించారు. పూలాజీబాబా ధ్యాన్ కేంద్రం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తారన్నారు. పీఆర్ రోడ్ నుంచి పూలాజీబాబా ధ్యాన్ కేంద్రం వరకు వరకు రూ. 10 లక్షల నిధులతో సీసీరోడ్డు మంజూరు చేయడంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పూలాజీబాబా వారసుడు ఇంగ్లే కేశవ్, అజీ ధ్యాన్ కేంద్రం అధ్యక్షుడు దశరథ్ గారుశే, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ముఖడే ఉత్తం, ఆంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలు ముఖడే విష్ణు, కుడే కైలాస్, డాకురే రాందాస్, కరాడే మారుతి, మాధవ్, పుండలిక్ పాల్గొన్నారు.

మహాయాగాన్ని జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: లోక కల్యాణార్థం ఈనెల 22 నుంచి వచ్చే ఏడాది జనవరి 6 వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల మైదానంలో నిర్వహించే 85వ విశ్వశాంతి మహాయాగానికి ప్రతీ హిందూ బంధువు తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల్ శ్రీనివాస్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. శ్రీవైష్ణవ ఆయుత చండీయాగం, అతిరుద్రం, శ్రీ సీతారామా సామ్రాజ్య పట్టాభిషేకం వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భగవత్కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో కాసార్ల శ్రీనివాస్, మేకల అశోక్, జక్కుల శ్రీనివాస్, తోకల నరేశ్, గన్నోజి విజయ్‌కుమార్, దశరథ్ పటేల్, ఎన్నావార్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి



అగ్నిగుండంలో నుంచి నడిచి వెళ్తున్న భక్తులు

తాంసి: మండలంలోని గిరిగాం గ్రామంలోని దత్తాత్రేయ ఆలయ 16వ వార్షికోత్సవంతో పాటు దత్త జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో శనివారం ఉదయం పండితులు జూకంటి గంగాధర్, మల్లిఖార్జున్, అంజనేయులు ఆధ్వర్యంలో నవగ్రహ పూజ, అర్చన, హోమం, కల్యాణంతో పాటు వేకువజామున అగ్నిగుండ ప్రవేశం చేశారు. అగ్నిగుండంలో నుంచి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు నడిచి వెళ్లారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మండల నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పర్ధాన్ ధనుంజయ్, గజానన్, తులసీరాం, గంగారం పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని జామ్నిలో శ్రీక్షేత్ర దత్తాత్రేయ దేవ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి భజన సంకీర్తనలు ఆలపించారు. జైనథ్ మండలంతో పాటు ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఆలయం జనాలతో కిక్కిరిసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణ, లింగు, సూర్యబాన్, మోహన్, తానాజీ, మోతిరాం, సురేశ్, ఆనంద్‌రావు, దాదారావ్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్ మండలంలోని కన్గట్ట గ్రామంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాహోర్ స్వామి ఆస్థానం ఆధ్వర్యంలో గ్రామ దత్తాత్రేయ ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం వేద పండితులు నమలికొండ సంతోష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో గణపతి గౌరీ పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దత్తాత్రేయ స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామ వీధులు దత్తాత్రేయ నామస్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఉట్నూర్‌రూరల్: గురువులతో పూర్వ విద్యార్థులు



బేల: పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ఉట్నూర్‌రూరల్/ బేల: ఉట్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ పాఠశాలలో, బేల మండల కేంద్రంలోని తెలుగు మీడియం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2012- 13 బ్యాచ్‌కి చెందిన ఐదో తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. చాలా రోజుల తరువాత కలుసుకోవడంతో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పినా.. గురువులను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. తరగతి గదిలోని జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు.

సైన్యంలో ఎంపికైన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన నలుగురు యువకులు భారత సైన్యంలో ఎంపికయ్యారు. వారిని గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. ఎంపికైన వారిలో తిత్రే జితేందర్, (సీఐఎస్ఎఫ్), బామన్ ధన్‌వీర్ (సీఐఎస్ఎఫ్), మహేశ్ (బీఎస్ఎఫ్), కటారే మేఘశ్యాం (సీఐఎస్ఎఫ్) ఎంపిక కాగా వారిని గ్రామస్తులు సన్మానించారు. ఈసందర్భంగా యువకులు మాట్లాడుతూ.. దేశ సేవ చేయడమే లక్ష్యంగా సైన్యంలో చేరామన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని యువత సైన్యంలో చేరడానికి ఆసక్తి కనబర్చాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.